బాలల ప్రాంగణం.. సమస్యల నిలయం!

- మూణ్నాళ్ల ముచ్చటగా వీఎంఆర్‌డీఏ పార్కు ఆట స్థలం
- పాడైన చిన్నారుల ఆట పరికరాలు


బల్లలు ఊడి ప్రమాదకరంగా..


పూర్తిగా విరిగిన ఆట వస్తువులు

ఏయూ క్యాంపస్: చిన్నారుల ఆట స్థలంలో సమస్యలు తిష్టవేశాయి. సాయంత్రం వేళల్లో కాస్త సమయం ఆటలాడుకుందామని ఆశగా వచ్చే చిన్నారులకు అక్కడ విరిగిన ఆట వస్తువులు వెక్కిరిస్తున్నాయి. టికెట్ కొని ఆట స్థలానికి వచ్చే చిన్నారులకు పనికిరాని, ప్రమాదకర ఆట వస్తువులు దర్శనమిస్తున్నాయి. ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన వీఎంఆర్‌డీఏ పార్కులోని బాలల ఆట స్థలంలో పరిస్థితులు దీనికి అద్దం పడుతున్నాయి.

నిర్వహణ శూన్యం

వీఎంఆర్‌డీఏ పార్కును పూర్తిస్థాయిలో ఆధునికీకరించి కొద్ది నెలల కిందట ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పార్కులో ఆహ్లాదకరంగా పరిసరాలను అభివృద్ధి చేశారు. ప్రకృతి రమణీయత, వాకింగ్ ట్రాక్‌లు, బాలలు ఆడుకోవడానికి బాస్కెట్‌బాల్ మైదానం వంటివి సుందరంగా తీర్చిదిద్దారు. వీటితో పాటు చిన్నారులు ఆడుకోవడానికి వివిధ ఆట వస్తువలతో కూడిన పార్క్‌ను ప్రత్యేకంగా నిర్మించారు. ప్రారంభంలో ఇవి ఎంతో ఆకట్టుకున్నాయి. నిర్వహణ గాలికి వదిలేయడంతో వీటిలో ఒక్కొక్కటిగా పాడైపోయాయి. ప్రస్తుతం ఈ పార్క్‌లో ఎటుచూసిన విరిగిన, ప్రమాదకంగా మారిన ఆట వస్తువులే దర్శనమిస్తున్నాయి. సాయంత్రం, రాత్రి వేళల్లో పార్క్‌కు వచ్చే చిన్నారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గాయాలపాలయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంగణంలో ఉన్న రెండు చెట్లు పూర్తిగా ఎండిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని తొలగించి కొత్త మొక్కలను నాటాల్సిన అవసరం ఉంది.

విరిగిన ఆట వస్తువులు

ప్రస్తుతం ఈ పార్కులో ఏ ఆట వస్తువును చూసినా విరిగి, ప్రమాదకరంగానే దర్శనమిస్తున్నాయి. వీటికి ఏర్పాటు చేసిన చెక్కలు వర్షానికి తడిచి విరిగిపోయాయి. అదే విధంగా ఫైబర్‌వంటి మెటీరియల్‌తో చేసిన ఇతర వస్తువులు సైతం ఊడిపోయాయి. మరికొన్ని విరిగిపోయాయి. చిన్నారులు ఆడుకోవడానికి ఉపయుక్తంగా ఒకటి, రెండు ఆట వస్తువులు మాత్రమే ఉన్నాయి. అదే విధంగా మార్బుల్ ఫ్లోరింగ్‌తో నిర్మించిన స్థలం శుభ్రం చేసే నాథుడు లేకపోవడంతో అధ్వానంగా తయారైంది.

- పిల్లల పార్క్ నిర్వహణపై వీఎంఆర్‌డీఏ అధికారులు కాస్త దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నగర సుందరీకరణకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న అధికారులు పార్కులో సదుపాయాల కల్పనపై శ్రద్ధ వహించాలని నగరవాసులు కోరుతున్నారు. కొద్ది రోజుల్లో వేసవి సెలవులు రానున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో చిన్నారులు పార్క్‌ను సందర్శించనున్నారు. సత్వరం అధికారులు స్పందించి పార్కులోని ఆట వస్తువులకు మరమ్మతులు చేపట్టి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.


కూలడానికి సిద్ధంగా ఉన్న ఎండిన చెట్టు

క్లుప్తంగా

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం 16.36 లక్షలు


హుండీ లెక్కిస్తున్న శివజ్యోతి సంఘం సభ్యులు

సీతమ్మధార: ఆశీలమెట్ట శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు గురువారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారులు వి.వసంతకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో 21 రోజులకు రూ.16.36 లక్షల నగదు, 25.700 మిల్లీగ్రాముల బంగారం, 133 గ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన డాలర్లు వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు, ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవింద్ రెడ్డి, డీఎస్ ప్రసాద్, ఈ. అప్పలరాజు, భక్తులు, బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాయిబాబా మందిర వార్షికోత్సవం


విశాలాక్షినగర్‌లో సాయిబాబా

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షి నగర్‌లో కైలాసగిరి కూడలిలో సద్గురు షిర్డీ సాయిబాబా మందిర 19వ వార్షికోత్సవం శుక్రవారం జరగనుంది. ఇందు కోసం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో సాయిబాబాకు ఉదయం నుంచి పూజలు చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నామన్నారు.

చేనేత కార్మికులకు ప్రోత్సాహం

బీచ్ రోడ్డు: చేనేత కార్మికులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో హస్తకళల క్రాఫ్ట్ మేళాను ప్రారంభించినట్లు జియోమార్ట్ సీఈవో సందీప్ తెలిపారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్థానిక కళాకారులు, వీవర్ కమ్యూనిటీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 10 వేల మంది కళాకారులు, నేత కార్మికులు రూపొందించిన 82 వేల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మేళాను ఆదివారం వరకు నిర్వహించనున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


బీచ్ రోడ్డులో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బీచ్ రోడ్డు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ పోయింద్రిల్లా బట్టాచర్య అన్నారు. ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్డులోని గ్లోబల్ క్లైమేట్ స్ట్రైక్ పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెట్ల నరకడం, జంతు హింస, ప్లాస్టిక్ వ్యర్థాల వాడకం కలిగే వాతావరణ కాలుష్యంపై అవగాహన కల్పించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ర్యాలీలో సెయింట్ జోసఫ్ కాలేజీ విద్యార్థినులు పాల్గొన్నారు.

బుల్లయ్య కాలేజీలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభమవుతున్న సందర్భంగా గురువారం కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ సంబంధిత పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో గత నెలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కోర్సు క్యాంప్ నిర్వహించామన్నారు. ఈ క్యాంపులో వివిధ కళాశాలల అధ్యాపకులు, బుల్లయ్య కాలేజీ లెక్చరర్లు పాల్గొని కోర్సును పూర్తి చేశారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆశా కార్యకర్తల శిక్షణ


మహిళా ప్రాంగణంలో ఆశా వర్కర్లకు శిక్షణ ఇస్తున్న పీహెచ్‌ఎన్‌వో సత్యవతి

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ వద్ద జిల్లా మహిళా ప్రాంగణంలో ఆశా కార్యకర్తల శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన 200 మంది ఆశా వర్కర్లకు ఈ నెల 14న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభమైన శిక్షణ ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనుంది. గురువారం పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్(పీహెచ్‌ఎన్‌వో) సత్యవతి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగంలో పనితనం మరింత మెరుగుపరచడంతో పాటు ఆరోగ్యంపై ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పించాలో వివరించారు. సీజనల్ వ్యాధులు, క్షయపై ప్రజలు ఎలాంటి జాగ్రతలు పాటించాలి, లింగ నిర్ధారణ వల్ల ఎదురయ్యే సమస్యలు తెలియజేశారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

కేజీహెచ్ ఉద్యోగులకు ఎముక సాంద్రత పరీక్ష


సిబ్బందికి ఎముక సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెగ్యులర్, కాంట్రాక్టు, సెక్యూరిటీ, శానిటేషన్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత రెండు రోజులుగా ఉచిత ఎముక సాంద్రత పరీక్ష నిర్వహిస్తున్నారు. 45 సంవత్సరాలు దాటిన స్త్రీలు, 55 సంవత్సరాలు దాటిన పురుషులకు ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఆర్ఎం డాక్టర్ జగదీష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ రెండు రోజుల పాటు 242 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ బోన్ డెన్సిటీ తగ్గితే ఎముకలు విరిగిపోవచ్చన్నారు. ఎముకల్లో కాల్షియం సాంద్రత తక్కువగా ఉంటే ఆలసట, నీరసానికి గురి కావడంతో పాటు ఎక్కువ దూరం నడవలేరని అన్నారు. అలాంటి వారు ఆకుకూరలు, మాంసాహారంతో పాటు కాల్షియం టాబ్లెట్లు తీసుకోవాలని తెలిపారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ధ్యాన శిబిరం


నగర సంకీర్తన చేస్తున్న ఆనంద్‌మార్గ్ ఆచార్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో గురువారం జాతీయ ధ్యాన శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరం దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ఆనంద్‌మార్గ్ ఆశ్రమం ఆచార్యులు పాల్గొన్నారు. మొదటి రోజు ధ్యానం అనంతరం ఆచార్యలంతా కలసి నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం స్వామీజీ ఆచార్య సౌమ్యానంద అవధూత మాట్లాడుతూ ఈ శిబిరం ఆదివారం వరకు కొనసాగుతుందన్నారు. ఇక్కడ సామూహిక ధ్యానంతో పాటు భజనలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు ధ్యానంలో పాల్గొనవచ్చన్నారు. ధ్యానంలో పాల్గొన్నవారికి ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు 95507 75518 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి అమ్మవారి పరస


అమ్మవారికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త విజయనిర్మల, తదితరులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో కొలువుదీరిన రాజరాజేశ్వరి అమ్మవారి పరస గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, గుడ్ల సత్యారెడ్డి, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి పరస సందర్భంగా చిరు వ్యాపారులు గృహోపకరణాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

30న శ్రీరామ నవమి వేడుకలు

సీతమ్మధార: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈ నెల 30న నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు రాజా స్వామి తెలిపారు. గురువారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10 గంటలకు కల్యాణం, అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటలకు సాయిబాబాను 1008 క్షీర కలశాలతో సీతమ్మధారలో ఊరేగిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆలయ చైర్మన్, కమిటీ, కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు, సిబ్బంది శివ, భక్తులు ఆలయంలో కలశాలు ప్రదర్శించారు.

ఏయూ సమాచారమ్

ఎన్‌డీసీ బృందం ఐఐపీఈ సందర్శన


ఐఐపీఈ అధికారులతో ఎన్‌డీసీ బృందం

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)ని గురువారం నేషనల్ డిఫెన్స్ కాలేజ్ నుంచి మేజర్ రాజేష్ అరుణ్ మోఘతో కూడిన నిపుణుల బృందం సందర్శించింది. ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ తమ సంస్థలో జరుగుతున్న పరిశోధన సంబంధ అంశాలను వివరించారు. దేశ ఇంధన అవసరాలు, భద్రతకు చేస్తున్న కృషిని పరిశోధన విభాగం డీన్ ఆచార్య కె.విజయ్ కుమార్ తెలియజేశారు. బయో ఫ్యూయల్స్, బ్యాటరీస్, కార్బన్‌కాప్చర్, సీక్వెస్టింగ్, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, సౌర విద్యుత్, వ్యర్థాల నుంచి ఇంధన ఉత్పత్తి, పవన విద్యుత్, జియో థర్మల్ ఎనర్జీ తదితర రంగాలపై చర్చించారు.

ఐఏఎస్‌ఈకి యూబీఏ నిధుల మంజూరు


యూబీఏ నిధులు స్వీకరిస్తున్న ఆచార్య టి.శోభశ్రీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఈ)కి ఉన్నత్ భారత్ అభియాన్(యూబీఏ)లో భాగంగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ రూ॥50 వేలు సీడ్ ఫండ్ మంజూరైంది. ఈ మేరకు గురువారం ఈ నిధులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ అందుకున్నారు. ఐఏఎస్ఈ దత్తత తీసుకున్న గ్రామాల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నట్లు శోభశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూబీఏ సమన్వయకర్త పావని, ఐఏఎస్ఈ సమన్వయకర్త డాక్టర్ సోనీ హవీలా, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న షారోన్ రాజు తదితరులు


బీచ్ రోడ్డులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు


ఎంవీపీ కాలనీ గ్రంథాలయంలో శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏయూ క్యాంపస్: ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. గురువారం ఏయూ విద్యా విభాగంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో శ్రీరాములు చిత్రపటానికి షారోన్‌రాజు పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసిన ఆ మహనీయుడు నేటి తరానికి ఆదర్శమన్నారు. పొట్టి శ్రీరాములు స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో జైలుకెళ్లిన సందర్భాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: సమైక్య భారతి, బీచ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిల్లానా దిలీప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశానికి ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఆచార్యులు డాక్టర్ సి.మంజులత అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా దిలీప్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో విజయనిర్మాణ సంస్థ చైర్మన్ ఎస్.విజయకుమార్, బీచ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బుట్టా వేణుగోపాలరావు, సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, డాక్టర్ బూసి వెంకటస్వామి, ఆచార్య జి.యోహాన్బాబు, డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వాసవి ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో శ్రీరాములు విగ్రహానికి కార్పొరేటర్ కందుల నాగరాజు, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని గ్రంథాలయంలో పలువురు వక్తలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు సూర్యప్రకాష్, రచయిత సుసర్ల సర్వేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామిక, ఇంజినీరింగ్ ఎక్స్‌పో ప్రారంభం


ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు

ఎంవీపీ కాలనీ: ఇండోర్ ఇన్ఫోలైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలస్ వేదికగా ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఎక్స్‌పోను గురువారం ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్(హైదరాబాద్), వైజాగ్ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ ఆపరేషన్స్ అరుణ్‌కాంతి బగ్చిలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజానికి, పరిశ్రమలకు సాంకేతికత అందించే ఎన్నో ఉత్పత్తులను ఆయా కంపెనీలు ఇక్కడ ప్రదర్శనలో ఉంచారన్నారు. ఇండోర్ ఇన్ఫోలైన్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఆర్కే అగర్వాల్ మాట్లాడుతూ ఉత్పత్తులను ప్రదర్శించిన ఎగ్జిబిటర్స్‌కు ఎంఎస్ఎంఈ భారత మంత్రిత్వశాఖ ద్వారా సబ్సిడీలు లభిస్తాయన్నారు. 18వ తేదీ వరకు ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ఆరుగురు గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌-ఏలో ద్వితీయ సంవత్సరం పరీక్షకు 518 మంది హాజరు కావాల్సి ఉంది. వీరిలో ముగ్గురు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. కృష్ణా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో 520 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. వీరిలో ముగ్గురు గైర్హాజరు కాగా.. 517 మంది పరీక్ష రాశారని చీఫ్ సూపరింటెండెంట్ సూర్యకుమారి తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు.

మీ పని మీదే.. మా పని మాదే!

- శ్రీసత్య ఆస్పత్రి వెనక గెడ్డలో మళ్లీ నిర్మాణం
- సచివాలయ సిబ్బంది వచ్చి పనులు నిలిపివేత


హెల్త్‌సిటీలో శ్రీసత్య ఆస్పత్రి వెనుక భాగంలో గెడ్డలో చేపడుతున్న గోడ నిర్మాణం

ఆరిలోవ: స్థానిక హెల్త్ సిటీలో ఉన్న శ్రీసత్య ఆస్పత్రి యాజమాన్యం అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేసింది. ఆస్పత్రి వెనక ఉన్న గెడ్డలో గోడ నిర్మాణం మళ్లీ ప్రారంభించింది. విషయం తెలుసుకున్న సచివాలయం సిబ్బంది గురువారం వెళ్లి మరోసారి ఆ పనులు నిలిపేశారు. ఇటీవల రెవెన్యూ అధికారులు గెడ్డలో నిర్మాణాన్ని ఆపేసినా కొద్ది రోజులకే మళ్లీ పనులు చేపట్టడంతో «మీ పని మీదే.. మా పని మాదే» అన్న చందంగా ఆస్పత్రి నిర్వాహకులు తీరు ఉందంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. కొద్ది నెలల క్రితం ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసుకుని వైద్య సేవలు కూడా అందిస్తోంది. ఈ ఆస్పత్రి హెల్త్ సిటీ లేఅవుట్‌లో చివరన ఆరిలోవ ప్రాంతం 40 గజాల కాలనీ వరకు ఉన్న శ్రీకాంత్‌నగర్ డబుల్ రోడ్డును ఆనుకుని ఉంది. ఈ రోడ్డుకు ఆస్పత్రి వెనక భాగానికి మధ్యలో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలం, గెడ్డ ఉన్నాయి. ఆ ఖాళీ స్థలాన్ని కాజేయడానికి ఆస్పత్రి నిర్వాహకులు గెడ్డ భాగాన్ని గతంలోనే పూడ్చేశారు. నెల రోజుల క్రితం ఆ గెడ్డలో గోడ నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ మండలం రెవెన్యూ అధికారులు, సంబంధిత సచివాలయం సిబ్బంది వెళ్లి అప్పట్లో పనులు నిలిపివేశారు. అప్పటికే నిర్మించిన గోడను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కానీ ఆస్పత్రి నిర్వాహకులు రెవెన్యూ సిబ్బంది ఆదేశాలు పక్కనబెట్టి ఆ గోడను తొలగించకుండా వదిలేశారు. సుమారు నెల రోజుల తర్వాత గతంలో మధ్యలో వదిలేసిన గోడపై మళ్లీ పనులు కొనసాగించారు. దీంతో గురువారం రెవెన్యూ అధికారుల ఆదేశాలతో సచివాలయం సిబ్బంది గెడ్డ వద్దకు చేరుకుని పనులు నిలిపేయాలని, ఇంతవరకు నిర్మించిన గోడ తొలగించాలని నిర్వాహకులకు సూచించి వెళ్లిపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి గెడ్డ మధ్యలో నిర్మిస్తున్న గోడను పూర్తిగా తొలగించి, పైనుంచి వచ్చే నీరు కిందకు పోవడానికి గెడ్డను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన


ఫుట్‌పాత్ ఆధునికీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

ఎంవీపీ కాలనీ: జీ–20 సదస్సుల్లో భాగంగా 19వ వార్డులో జరుగుతున్న సుందరీకరణ పనులను జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు గురువారం పరిశీలించారు. ఉదయం పర్యటనలో భాగంగా అప్పుఘర్, లాసన్స్ బే కాలనీ ప్రాంతాలను ఆనుకుని బీచ్‌రోడ్డులో సాగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫుట్‌పాత్‌ల ఆధునికీకరణ, పెయింటింగ్స్ పనులు జరుగుతున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యతతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జీ–20 సదస్సుకు దేశ విదేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో వారిని ఆకట్టుకునే విధంగా పనులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జీవీఎంసీ జోన్–3 అధికారులు పాల్గొన్నారు.